ఇండియాలో మిగిలేది రాహుల్ ఒక్కరే!

- బీజేపీ-కాంగ్రెస్‌ది ఫెవికాల్ బంధం
- కేసీఆర్ వంటి నేతలతోనే బీజేపీకి చెక్
- బీజేపీ గెలుపు కోసం కాంగ్రెస్ 'డమ్మీలు'
- పార్లమెంటులో తెలంగాణ గొంతు వినబడాలంటే బీఆర్‌ఎస్ గెలవాల్సిందే
- జూబ్లీహిల్స్ సమావేశంలో కేటీఆర్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 27 (నమస్తే తెలంగాణ): బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో చివరికి మిగిలేది రాహుల్‌గాంధీ ఒక్కరేనని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం తమవల్ల కాదని మమతాబెనర్జీ, కేజ్రీవాల్, నితీశ్‌కుమార్ బయటకు వెళ్లిపోయారని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీజేపీని ఓడించే సత్తా కాంగ్రెస్‌కు కానీ, రాహుల్‌కు కానీ లేదని తేలిపోయిందని పేర్కొన్నారు. ప్రాంతీయంగా బలంగా ఉన్న కేసీఆర్, కేజ్రీవాల్, మమతాబెనర్జీ, పినరయి విజయన్ వంటివారు మాత్రమే బీజేపీకి, మోదీకి అడ్డుకట్ట వేయగలరని స్పష్టం చేశారు. అలవిగాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ చక్కని అవగాహనతో పనిచేస్తున్నాయని, వాటిది ఫెవికాల్ బంధమని ఆరోపించారు.

అక్కడ డమ్మీ అభ్యర్థులే

త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్‌లో బీజేపీని గెలిపించేందుకు కాంగ్రెస్ అక్కడ డమ్మీ అభ్యర్థులను నిలబెడుతుందని చెప్పారు. అదానీ-మోదీ డబుల్ ఇంజిన్ అన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదానీతో కలిసి పనిచేస్తున్నారని, ఆ పార్టీల మధ్య బంధానికి ఇదే నిదర్శనమని వివరించారు. నాలుగు నెలల క్రితం దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పేర్లను కేసీఆర్ క్యాబినెట్ తీర్మానించి పంపినా తిరస్కరించిన గవర్నర్ ఇప్పుడు కోదండరాం పేరు పంపగానే సంతకం చేశారని తెలిపారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఒకే నోటిఫికేషన్ ఇచ్చి ఉంటే బీఆర్‌ఎస్‌కు కూడా ఒక స్థానం వచ్చి ఉండేదని, కానీ రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి అమిత్‌షాను కలిసి రాగానే రెండు స్థానాలకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లు జారీచేశారని, దీనిని బట్టి చూసినా ఆ రెండు పార్టీల మధ్య ఉన్న బంధాన్ని అర్థం చేసుకోవచ్చని వివరించారు. పార్లమెంటులో తెలంగాణ గొంతు వినబడాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో యూసుఫ్‌గూడ నుంచి తెలంగాణభవన్ వరకు ఆటోలో ప్రయాణించి ఆటోడ్రైవర్ రమేశ్‌కు రూ.2500 అందజేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నరకం చూస్తున్నాం..!

ఇంటి అద్దెలు కూడా కట్టలేకపోతున్నాం • గిరాకీ లేక ఈఎంఐలు చెల్లించడం లేదు

- కొందరు ఆత్మహత్య చేసుకున్నరు
- మీరే ఏదైనా చేయాలి.. ఆదుకోవాలి
- ఆటోలో ప్రయాణించిన కేటీఆర్‌కు డ్రైవర్ రమేశ్ సమస్యల ఏకరువు
- ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం
- కుటుంబంతో భవన్‌కు రండి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు

హైదరాబాద్/ సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు శనివారం ఆటో ఎక్కారు. యూసుఫ్‌గూడ నుంచి తెలంగాణభవన్ వరకు ఆటోలో ప్రయాణించారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో గిరాకీ లేక ఇంటి అద్దెలు కట్టలేకపోతున్నామని, కనీసం ఆటో కిస్తీలు చెల్లించలేకపోతున్నామని, తోటి ఆటో డ్రైవర్లు కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆటో డ్రైవర్ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అధైర్య పడొద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన కేటీఆర్ భరోసా నింపారు.

చలో తెలంగాణభవన్ వరకు తీసుకెళ్లు..

హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని మహమూద్ హౌస్ గ్రాండ్ గార్డెన్‌లో జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ నాయకుల నియోజకవర్గ సమీక్ష శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్.. సమావేశం పూర్తయ్యాక నేరుగా ఆ హాలు నుంచి బయటకొచ్చి అక్కడ ఆగి ఉన్న ఆటోలో ఎక్కారు. అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఆటో డ్రైవర్ శాతం రమేశ్ ఒక్కసారిగా కేటీఆర్‌ను చూసి మురిసిపోయాడు. సార్.. సార్.. అంటూ సంతోషపడ్డాడు. ఆటో డ్రైవర్ భుజం తడుతూ చలో తెలంగాణభవన్ వరకు తీసుకెళ్లు.. అంటూ చెప్పడంతో ఆ డ్రైవర్ తన ఆటోను తెలంగాణభవన్ రూటుకు మళ్లించాడు. ఈ ప్రయాణంలో కేటీఆర్ ఆటో డ్రైవర్ల స్థితిగతులను తెలుసుకున్నారు. కేటీఆర్‌కు, ఆటో డ్రైవర్ రమేశ్‌కు మధ్య ఆసక్తికర చర్చ కొనసాగింది.

కేటీఆర్: **బాస్.. ఏం పేరు? ఎప్పట్నుంచి ఆటో నడుపుతున్నావు?**

ఆటోడ్రైవర్: సార్.. నా పేరు శాతం రమేశ్. 25 ఏండ్ల నుంచి ఆటో నడుపుతున్న.

కేటీఆర్: **మీది ఏ ఊరు? కుటుంబ పరిస్థితి ఏంటి?**

ఆటోడ్రైవర్: మాది యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని మోటకొండూర్ సార్. నాకో కొడుకు, కూతురు ఉన్నారు. వాళ్లు కాలేజీకి వెళ్లారు సార్.

కేటీఆర్: **ఏమైనా సమస్యలు ఉన్నాయా?**

ఆటో డ్రైవర్: సార్.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బాగుండే. ఇప్పుడు కాంగ్రెస్ వచ్చాక మా బతుకులు రోడ్డున పడ్డాయి. ఉపాధి కోల్పోయాం. తోటి డ్రైవర్లు కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎలా బతకాలో తెలియడం లేదు సార్. మీరే ఏదైనా చెయ్యాలి సార్. ఊళ్లల్లో అయితే పరిస్థితి మరీ ఘోరంగా ఉంది సార్. గిరాకీ లేక ఈఎంఐలు చెల్లించలేక నరకం చూస్తున్నాం సార్. ఇక్కడ ఇంటి అద్దెలు కూడా కట్టలేకపోతున్నాం.

కేటీఆర్: **ధైర్యంగా ఉండండి. ఎవ్వరూ కూడా ఆత్మహత్యలు చేసుకోవొద్దు. మీ ఆటో డ్రైవర్ల సమస్యలపై నివేదిక తెప్పించుకున్నాం. తప్పకుండా మీ సమస్య పరిష్కారమయ్యేలా మా పార్టీ తరపున పోరాడుతాం.**

ఆటో డ్రైవర్: మాకు మీపైనే నమ్మకం ఉన్నది సార్.

కేటీఆర్: **ఏం చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారు మీరు?**

ఆటో డ్రైవర్: సార్.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చిన మాదిరిగానే మా ఆటోలో కూడా డిజిటల్ మిషన్ ఏర్పాటుచేసి మహిళలకు ఉచిత ప్రయాణ కార్డు ఇచ్చి ఆటోలో కూడా ఉచితమని చెప్పాలి. మా ఆటోలో ఎంతమంది మహిళలు ఎక్కుతారో మిషన్లో నిక్షిప్తం అవుతాయి కాబట్టి వాటి ఆధారంగా వారానికో.. నెలకో మాకు డబ్బులు చెల్లిస్తే బాగుంటుందని అనుకుంటున్నాం సార్.

కేటీఆర్: **ఆలోచన బాగుంది. గతంలో, ఇప్పుడు ఎంత సంపాదన ఉంది?**

ఆటో డ్రైవర్: గతంలో రోజుకు 15 వందల నుంచి 2 వేల వరకు సంపాదించేవాళ్లం. కనీసం వెయ్యి తప్పనిసరిగా ఉండేది. కానీ ఇప్పుడు 300 దాటడం లేదు.

కేటీఆర్: **ఇక్కడ ఎక్కడుంటావు?**

ఆటో డ్రైవర్: మాది నాచారం సార్. పొద్దున ఇటువైపు ఓ ట్రిప్ ఉంటే వచ్చాను. ఇక్కడ మీటింగ్ జరుగుతుందని తెలుసుకొని ఎవ్వరైనా ఆటోలో ఎక్కుతారేమోనని వచ్చాను. చూస్తే మీరెక్కారు సార్ (ఇద్దరు నవ్వుతూ..) సార్.. పెద్ద సార్ ఆరోగ్యం ఎలా ఉంది?

కేటీఆర్: **బాగుంది. మీ ఆటో డ్రైవర్ల గురించి మాట్లాడారు. మీ సమస్యలపై మాట్లాడుతానని అన్నారు.**

ఆటో డ్రైవర్: సార్.. కేసీఆర్‌ని కాంగ్రెసోళ్లు తిడుతుంటే కడుపు తరుక్కుపోతున్నది సార్?

కేటీఆర్: **ఏ.. ఎందుకు?**

ఆటో డ్రైవర్: ఎన్నో ఏండ్ల నుంచి కోరుకుంటున్న తెలంగాణను చావు నోట్లో తల పెట్టి తెచ్చాడు. అంతటి గొప్ప వ్యక్తిని ఎవ్వరైన ఏమైనా అంటే కోపమొస్తది సార్.

కేటీఆర్: **డ్రైవర్ భుజం తడుతూ.. ఔను. విమర్శలను పట్టించుకుంటే మనం ముందుకెళ్లలేం. భవన్ వచ్చేసింది. ఇక్కడ ఆపు. మరో రోజు నువ్వు, నీ కుటుంబంతో కలిసి తెలంగాణభవన్‌కు వచ్చి నన్ను కలువు.**

ఆటో డ్రైవర్: సార్.. తప్పకుండా. థ్యాంక్యూ సార్.

కేటీఆర్ సార్.. నా ఆటో ఎక్కడం అదృష్టం: ఆటో డ్రైవర్

ఆటో డ్రైవర్ శాతం రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. 'కేటీఆర్ సార్ నా ఆటోలో ఎక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆటోలో సార్ వెంట జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఉన్నారు. భవన్ చేరుకున్నాక కేటీఆర్ సార్ నాకు ఫోన్ నంబర్ ఇచ్చారు. భవన్‌కు వచ్చి ఫోన్ చేయమన్నారు. రూ.2,500 చేతిలో పెట్టారు. నాకు చాలా సంతోషంగా ఉన్నది' అని పేర్కొన్నారు.

సిద్దిపేటలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

2 నెలల్లో 14 వేల కోట్ల అప్పు

నాడు నానాయాగీ.. నేడు అప్పుల కొప్పులు

- అబద్ధాల పునాదిపై కాంగ్రెస్ సర్కారు
- లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోగా ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- పాలకులకు సహనం ఉండాలి
- తెలంగాణ ప్రయోజనాలు, హక్కులు కాపాడేది బీఆర్‌ఎస్సే
- సిద్దిపేట సభలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.14 వేల కోట్ల అప్పు చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని ఎన్నికల సందర్భంగా ఆరోపణలు చేసిన ప్రస్తుత సీఎం రేవంత్, ఇప్పుడు ఎందుకు అప్పులు చేస్తున్నారని ప్రశ్నించారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెన్‌లో సిద్దిపేట నియోజకవర్గ కార్యకర్తల కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. ఎన్నికల హామీలను ఎట్లా ఎగ్గొటాలనే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. హామీలన్నీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగానే అమలుచేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలు అయిపోగానే హామీలపై చేతులెత్తేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. 'అన్ని పథకాలకు లెక్కలు సిద్ధంగానే ఉన్నాయి కదా? అమలు చేయవచ్చు కదా? ఏం అడ్డం ఉన్నది మీకు?' అని సూటిగా ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో, అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు మాట్లాడిన వీడియోలను సమావేశంలో బీఆర్‌ఎస్ క్యాడర్‌కు చూపించి వారి తీరును ఆయన ఎండగట్టారు.

అబద్ధాలపై ఏర్పడిన ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ప్రచారంతో రాష్ట్రం లో అధికారంలోకి వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ తీరు ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు.. నేడు పాలనలో అసహనం అని దుయ్యబట్టారు. కొన్ని యూట్యూబ్ చా నళ్లు కూడా బీఆర్‌ఎస్‌కు నష్టం చేశాయని అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోగా రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చే యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని స్పష్టంచేశారు. 'ప్రగతి భవన్‌లో ఏమోమో ఉన్నాయని ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఇవాళ ప్రగతిభవన్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఉన్నారు కదా? అందులో ఏం ఉన్నాయో చెప్పుమని మొన్న అసెంబ్లీలో అడిగితే వారి వద్ద సమాధానం లేదు. అంటే ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు చెప్పామని కాంగ్రెస్ నాయకులు అంగీకరించినట్టే కదా? నాడు పెట్టుబడుల కోసం దావోస్ వెళ్తే కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఇవ్వాళ మీరు చేసింది ఏంటి? సచివాలయంలో లంకె బిందెలున్నాయనికొని వస్తే ఖాళీ బిందెలు ఉన్నాయని సీఎం రేవంత్ అంటున్నారు. లంకె బిందెలు ప్రభుత్వ భవనాల్లో ఉంటాయా? అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలి. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? బీఆర్‌ఎస్‌కు ఉద్యమాలు, దాడులు, బెదిరింపులు కొత్తకాదు. రైతులకు ఇప్పుడు 24 గంటలు కరెంట్ అమలు కావడం లేదు. ఎరువుల కొరత మొదలైంది' అని హరీశ్‌రావు విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ మోసాలు

ఎన్నికల్లో అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని హరీశ్‌రావు విమర్శించారు. 'నాలుగు వేల ఫించన్ అన్నారు. మోసం చేసింద్రు. రూ.15 వేల రైతుభరోసా అన్నారు. ఇవ్వలేదు. వడ్లకు క్వింటాల్‌కు రూ 500 వడ్లకు బోనస్ అన్నారు. ఆ ఊసే లేదు. రైతులకు 2 లక్షల రుణమాఫీ అన్నారు. తొలి క్యాబినెట్‌లోనే మెగా డీఎస్సీ అన్నారు. ఇప్పటివరకు ఏమీ ఇవ్వకుండా మోసం చేశారు' అని మండిపడ్డారు. రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన కోటి 54 లక్షల మంది అక్కాచెల్లెలు ఉన్నారని, వారందరికీ నెలకు రూ.2,500 చొప్పున వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు భృతి ఇచ్చేదాకా ప్రభుత్వం వెంట పడుతామని తేల్చి చెప్పారు. హామీల గురించి అడిగితే కాంగ్రెస్ సర్కారు బీఆర్‌ఎస్‌పై ఎదురుదాడికి దిగుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. 'ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా నీరందలేదని కొందరు కాంగ్రెస్ నాయకులు చెప్పున్నారు. మంత్రి కొండా సురేఖ వచ్చి కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు రంగనాయకసాగర్ నుంచి లక్షా పదివేల ఎకరాలకు నీళ్లు ఇస్తున్నామని చెప్పారు. ఒక్క రంగనాయకసాగర్ నుంచే ఇన్ని ఎకరాలకు సాగునీరు అందితే, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, అన్నపూర్ణ ఇలా వివిధ ప్రాజెక్టుల కింద లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది కదా?' అని ప్రశ్నించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శనివారం వనపర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ రావుల తదితరులు

అభివృద్ధిని చెప్పటంలో వెనుకబడ్డాం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల
- వనపర్తిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

వనపర్తి, జనవరి 27: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో కొంత వెనుకబడిపోయామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల వ్యూహరచనపై అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి ఫలాలు అందిస్తే చాలు విజయం సాధిస్తామన్న ఆలోచనలో అడుగులు వేశామని, కొంత ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండలేకపోయామని తెలిపారు. కానీ, ఇప్పుడు కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఉన్నా.. ఎనీ టైం అండగా ఉంటామని భరోసానిచ్చారు. సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అన్ని రకాలుగా అభివృద్ధి చేసిందని, కానీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంతో తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. అనంతరం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో మాదిరిగానే బీఆర్‌ఎస్ పార్టీ విజయం కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలపై ప్రజలకు రోజురోజుకూ విశ్వాసం సన్నగిల్లుతున్నదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయుడు నాగం తిరుపతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

బోథ్‌లో నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

తెలంగాణ హక్కుల గళం బీఆర్‌ఎస్సే

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి • ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్

బోథ్, జనవరి 27: పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలను వినిపించే సత్తా బీఆర్‌ఎస్ పార్టీకే ఉన్నదని ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్ చెప్పారు. శనివారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో భాగంగా బోథ్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో దేశపతి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. దశాబ్దకాలంగా పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు వేల సంఖ్యలో ప్రశ్నలు లేవనెత్తారని గుర్తుచేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం ఇక్కడి ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇటీవలే ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన అనంతరం బీఆర్‌ఎస్‌ను ఫినిష్ చేద్దాం అని కుట్ర పన్నుతున్నాయనే వార్తను ఓ పత్రిక ప్రచురించిందని గుర్తు చేశారు. తెలంగాణ గొంతుకైన బీఆర్‌ఎస్‌ను ప్రజల నుంచి ఎవరూ దూరం చేయలేరని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించడానికి ప్రజలు సమయత్తం అవుతున్నారని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ గడ్డం నగేశ్, ఆత్రం సక్కు, జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు.

సమావేశాలతో కార్యకర్తల్లో జోష్

- పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్‌ఎస్ దిశానిర్దేశం
- జూబ్లీహిల్స్ సమావేశంలో కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన శనివారం సిద్దిపేట, జూబ్లీహిల్స్, వనపర్తి, నల్లగొండ, బోథ్ నియోజకవర్గ సమావేశాలు జరిగాయి. సిద్దిపేట సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు, జూబ్లీహిల్స్ సమావేశానికి కేటీఆర్, వనపర్తి సమావేశానికి మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, నల్లగొండ సమావేశంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, బోథ్ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు, కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకున్నారు. ఆదివారం మెదక్‌లో జరగనున్న సమావేశానికి నిరంజన్‌రెడ్డి, సిరిసిల్లలో కేటీఆర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ముషీరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎల్ రమణ, పాలకుర్తి సమావేశానికి హరీశ్‌రావు హాజరవుతారు.

మీకు ఓటేస్తే.. చెప్పుదెబ్బలా?

› మొదటిపేజీ తరువాయి...

నల్లగొండ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ నేతలు బండ నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

భూపాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జిల్లాకేంద్రంలో నల్లగొండ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు తెలంగాణ సమాజం రెడీ అవుతున్నదని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించి విజయఢంకా మోగిద్దామని పిలుపునిచ్చారు. ఆచరణ సాధ్యం కాని 420 హామీలిచ్చి కాంగ్రెస్ గెలిచిందని, వాటిని అమలు గురించి అడిగితే మంత్రులు వ్యక్తిగత దూషణలు, బూతులతో ఎదురుదాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. అధికారం అడ్డం పెట్టుకుని దాడులు చేస్తూ, కేసులు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వారం పదిరోజుల్లోనే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రజాక్షేత్రంలో అడుగుపెడతారని, త్వరలోనే నల్లగొండకు కూడా వస్తారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పిలుపునిచ్చారు. మున్సిపాలిటీల అవిశ్వాసాల సాక్షిగా మరోసారి కాంగ్రెస్, బీజేపీ ఐక్యత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు

నల్లగొండ నియోజకవర్గం నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలివచ్చారు. సమావేశం నిర్వహించిన నల్లగొండలోనే అతిపెద్దదయిన లక్ష్మీగార్డెన్ పార్టీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. సమావేశంలో జడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, పంకజ్ యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, మాలె శరణ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం?

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఫిబ్రవరి ఒకటో తేదీన రాష్ట్ర శాసనసభ్యుడిగా ప్రమాణం చేయనున్నట్టు తెలిసింది. 2023 నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో గజ్వేల్ ఎమ్మెల్యేగా కే చంద్రశేఖర్‌రావు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత ఆయన నివాసంలో జారిపడటం తుంటి ఎముక విరగడం, ఆపరేషన్ కావడం, డాక్టర్ల సూచన మేరకు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కొలుకొని ఫిబ్రవరి ఒకటిన ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తారని తెలిసింది. ప్రమాణం తేదీ శనివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.